# Vyoma Telugu Current Affairs- 04-09-2018

## ఉప్పులోనూ ప్లాస్టిక్ ఉందని తేల్చిన ఐఐటీ బాంబే పరిశోధకులు

నిత్యం ఆహారంలో భాగంగా తీసుకుంటున్న ప్రముఖ కంపెనీలకు చెందిన ఉప్పు ప్యాకెట్లలో ప్లాస్టిక్ ఉందని పరిశోధనలు తేల్చి చెబుతున్నాయి. ఐఐటీ బాంబేలోని సెంటర్ ఫర్ ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ విభాగం(సీఈఎస్ఈ) చేపట్టిన పరిశోధనలో 8 కంపెనీలకు సంబంధించిన ఉప్పు ప్యాకెట్లను పరిశీలించగా వాటిలో 626 ప్లాస్టిక్ రేణువులు లభ్యమయ్యాయి. వీటి సగటు పరిమాణం 5 మిల్లీమీటర్లు. నదులు, కాలువల ద్వారా సముద్రాల్లో కలుస్తున్న ప్లాస్టిక్ విచ్ఛిన్నం కావడంతో ఈ సూక్ష్మ రేణువులు ఏర్పడ్డాయని పరిశోధనలో పాల్గొన్న ప్రొ. అమ్రితాన్షు శ్రీవాత్సవ్, చందన్‌కృష్ణ సేత్ తెలిపారు. కలుషిత నీటితో తయారైన ఉప్పు ద్వారా అవి మానవుల దేహంలోకి ప్రవేశిస్తున్నాయని తెలిపారు. గృహ, పారిశ్రామిక అవసరాల కోసం ఉప్పును తయారుచేస్తున్న దేశాల్లో చైనా, అమెరికాల తర్వాత భారత్ మూడోస్థానంలో ఉన్న నేపథ్యంలో ఈ పరిశోధన చేపట్టారు.

**పరిశోధన ఎలా చేశారు?**

ముంబైలోని సూపర్‌మార్కెట్లు, దుకాణాల్లో అమ్ముతున్న ఒకే నెలలో తయారైనవి కాకుండా 8 కంపెనీలకు చెందిన 24 ఉప్పు ప్యాకెట్లను(ఒక్కో బ్రాండ్‌కు మూడు చొప్పున) పరిశోధకులు కొనుగోలు చేశారు. ప్రయోగశాలలో పరీక్షించగా వీటిలో 63 శాతం చిన్నచిన్న రేణువులు, మిగిలినది ప్లాస్టిక్ ఫైబర్ రూపంలో ఉన్న 626 సూక్ష్మ ప్లాస్టిక్ రేణువులు బయటపడ్డాయి. ఇందులో 80 శాతం రేణువులు 2 మి.మీ కంటే తక్కువ పరిమాణంలో ఉన్నాయి. దీని ప్రకారం ఏటా 0.117 మిల్లీగ్రాముల ప్లాస్టిక్‌ను భారతీయులు తమకు తెలియకుండా ఆహారంలో తీసుకుంటున్నట్లు పరిశోధకులు నిర్ధారించారు. 8 సంస్థల్లో ఆరు గుజరాత్‌కు చెందినవి కాగా, కేరళకు చెందిన రెండు కంపెనీలు, మహారాష్ట్రకు సంబంధించి ఓ కంపెనీ ఉంది. సముద్రపు నీటిలో కాలక్రమేణా విచ్ఛిన్నమవుతున్న ప్లాస్టిక్ రేణువులు ఉప్పు, ఇతర సముద్ర ఉత్పత్తుల రూపంలో మనుషుల ఆహారపు గొలుసులోకి చేరుతున్నాయని 'సూక్ష్మ ప్లాస్టిక్ రేణువులతో కలుషితమవుతున్న భారత సముద్రజలాలు– అరికట్టేందుకు అనుసరించాల్సిన వ్యూహం' పేరుతో తాము చేపట్టిన అధ్యయనంలో వెల్లడైందని ప్రొ.అమ్రితాన్షు శ్రీవాత్సవ్ వెల్లడించారు. ఈ పరిశోధన 'ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ అండ్ పొల్యూషన్ రీసెర్చ్' అనే ప్రఖ్యాత జర్నల్‌లో ప్రచురితమైంది.

## మయన్మార్‌లో రాయిటర్స్ జర్నలిస్టులకు జైలు శిక్ష

మయన్మార్ అధికారిక రహస్యాల చట్టాన్ని ఉల్లంఘించినందుకు ఇద్దరు రాయిటర్స్ జర్నలిస్టులు వా లోన్(32), కాసో ఓ(28)లకు మయన్మార్ న్యాయస్థానం సెప్టెంబర్ 3న ఏడేళ్ల జైలుశిక్ష విధించింది. రోహింగ్యా ముస్లింల ఊచకోతపై కథనాలు రాసి ఇక్కడి చట్టాలను అతిక్రమించినందుకే వారికి జైలు శిక్ష విధించామని యాంగూన్ కోర్టు తెలిపింది.

2017 ఆగస్టులో అరాకన్ రోహింగ్యా సాల్వేషన్ ఆర్మీ(ఏఆర్ఎస్ఏ)కి చెందిన కొందరు ఉగ్రవాదులు మయన్మార్‌లోని రఖైన్ రాష్ట్రంలో పోలీస్ స్టేషన్లు, ఆర్మీ కేంద్రాలపై దాడిచేశారు. దీంతో ఉగ్రవాదుల ఏరివేతకు మయన్మార్ సైన్యం చేపట్టిన ఆపరేషన్ వల్ల దాదాపు 7 లక్షల మంది రోహింగ్యా ముస్లింలు బంగ్లాదేశ్‌కు పారిపోయారు. ఈ ఆపరేషన్ సందర్భంగా రఖైన్‌లోని ఇన్ డిన్ గ్రామంలో 10 మంది అమాయకుల్ని మయన్మార్ సైన్యం కాల్చిచంపిన విషయాన్ని వా లోన్, కా ప్రచురించారు. యాంగూన్‌లో జరిగిన ఓ విందు కార్యక్రమంలో పాల్గొన్న వీరికి పోలీస్ అధికారే కొన్ని కాగితాలను రహస్యంగా అందించి అరెస్టు చేయించారనేది కా, లోన్‌ల ఆరోపణ.

## 200 ఏళ్లనాటి బ్రెజిల్ మ్యూజియంలో అగ్ని ప్రమాదం

బ్రెజిల్ రాజధాని రియోడి జనీరోలో ఉన్న 200 ఏళ్లనాటి పురావస్తుశాల నేషనల్ మ్యూజియంలో భారీ అగ్నిప్రమాదం జరిగింది. దీంతో శతాబ్దాల కాలం నాటి జీవి, మానవశాస్త్ర, పురావస్తు శాస్త్ర, మానవజాతికి సంబంధించిన, భూగర్భ శాస్త్ర, జంతుజాలానికి సంబంధించిన అన్ని రకాల కళాఖండాలు కాలిపోయాయని  బ్రెజిల్ అధ్యక్షుడు మిచెల్ టెమర్ తెలిపారు.

**మ్యూజియం విశేషాలు**

- ఈ మ్యూజియంలో దాదాపు 20 మిలియన్ల కళాఖండాలు ఉన్నాయి.
- అత్యంత ప్రసిద్ధ కళాఖండాలలో ఒకటైన, సుమారు 11,000 సంవత్సరాల క్రితం మరణించిన 25 ఏళ్ల మహిళ పుర్రె మరియు ఎముకలు అయిన "లుజియాష కూడా ఇందులో ఉంది.
- 1784 సంవత్సరంలో కనుగొన్న సుమారు 5.36 టన్నులు బరువు ఉన్న అతిపెద్ద ఉల్క కూడా ఇక్కడే ఉంది.

- బ్రెజిల్‌లోని పోర్చుగీసు రాయల్ ఫ్యామిలీ ప్యాలెస్ ను 1818లో మ్యూజియంగా మార్చి, ప్రముఖ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌గా ఏర్పాటు చేశారు.

## లండన్ హీత్రూను అధిగమించనున్న ఢిల్లీ ఎయిర్‌పోర్టు

ప్రయాణికుల రద్దీ విషయంలో ఢిల్లీలోని ఇందిరాగాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్(ఐజీఐ) లండన్ లోని హీత్రూ ఎయిర్‌పోర్ట్‌ను అధిగమించనుందని సిడ్నీకి చెందిన ఆసియా–పసిఫిక్ ఏవియేషన్(కాపా) ఇండియా అంచనా వేసింది. 2017–18లో ఐజీఐ నుంచి 6.57 కోట్ల మంది ప్రయాణించగా, 2019–20 నాటికి ఈ సంఖ్య 8 కోట్లకు చేరొచ్చని నివేదిక తెలిపింది. ఇదే విధంగా రద్దీ కొనసాగితే 2020 నాటికి హీత్రూ విమానాశ్రయం ట్రాఫిక్‌ను ఐజీఐ మించిపోనుందని కాపా విశ్లేషించింది. 2017-18 లో భారత విమానాశ్రయాలు 30.9 కోట్ల మందిని గమ్యస్థానాలకు చేర్చాయి. అంతక్రితం ఏడాదితో పోలిస్తే ఇది 16.5 శాతం అధికం. ఐజీఐ విమానాశ్రయం ద్వారా రోజూ 1,200 విమానాలు రాకపోకలు సాగిస్తుంటాయి. 4 కోట్లకు పైగా ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్న విమానాశ్రయాల్లో ఢిల్లీ ఐజీఐ తొలి స్థానంలో ఉందని ‘ఎయిర్‌పోర్ట్స్ కౌన్సిల్ ఇంటర్నేషనల్’ సంస్థ గతంలో తెలిపింది.

## క్రికెట్‌కు అలిస్టర్ కుక్ వీడ్కోలు

ఇంగ్లాండ్ స్టార్ క్రికెటర్ అలిస్టర్ కుక్ అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు చెప్పాడు. భారత్‌తో ప్రస్తుతం జరుగుతున్న టెస్టు సిరీస్ తర్వాత క్రికెట్‌కు గుడ్‌బై చెప్పున్నట్లు 33 ఏళ్ల కుక్ ప్రకటించాడు. కెరీర్ మొత్తంలో 160 టెస్టులాడి 44.88 సగటుతో 12254 పరుగులు చేసిన కుక్ 32 సెంచరీలు, 56 అర్ధ సెంచరీలు చేశాడు. టెస్టు ఆటగాడిగా ముద్ర పడిన కుక్ టెస్టుల్లో అత్యధిక పరుగులు చేసిన బ్యాట్స్‌మెన్‌లలో సచిన్ (15,921), పాంటింగ్ (13,378) కలిస్(13,378), ద్రవిడ్ (13,288), సంగక్కర (12,400) తర్వాత 6వ స్థానంలో ఉన్నాడు. ఇంగ్లండ్ తరఫున అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా నిలచాడు. గత కొంత కాలంగా పేలవ ప్రదర్శనతో విఫలమవుతున్న కుక్‌పై తీవ్ర విమర్శలు రావడంతో తప్పుకున్నట్లు ప్రకటించాడు.

**కుక్ టెస్టు కెరీర్**

టెస్టులు : 160

ఇన్నింగ్స్: 289

పరుగులు: 12,254

అత్యధిక స్కోరు: 294

సగటు : 44.88

సెంచరీలు: 32

అర్ధసెంచరీలు : 56

క్యాచ్‌లు : 173